

గన్నవరంలో టీడీపీ కార్యాలయంపై దాడిలో అనగాని (ఫైల్)





బిగుస్తున్న ఉచ్చు!

వైసీపీ నాయకులకు వరుస నోటీసులు

గుడివాడలో టీడీపీ కార్యాలయంపై దాడి (ఫైల్)

- అధికారం దన్నుతో నాడు ఎన్నో పాపాలు
- నేడు తిరగతోడుతున్న కేసులు
- ఇప్పటికే జోగి కుమారుడి అరెస్టు
- టీడీపీ ఆఫీసుపై దాడిలో అవినాశ్‌కు నోటీసులు
- కొడాలి నాని కొంపముంచుతున్న కేసినో
- టీడీపీ నిజనిర్ధారణ కమిటీపై దాడి కేసు రీ ఓపెన్
- గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడిలో వంశీ
- ముందస్తు బెయిల్ కోసం పాట్లు

ఉమ్మడి కృష్ణాజిల్లా వైసీపీ నేతల చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. అధికారం చేతిలో ఉందన్న అంధకారంతో ఇష్టానుసారంగా వ్యవహరించిన నాటి నాయకుల పని పట్టేందుకు టీడీపీ ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. ఇప్పటికే అగ్రిగోల్డ్ భూముల కబ్జా కేసులో మాజీమంత్రి జోగి రమేశ్ తనయుడు రాజీవ్‌ను అరెస్టు చేయగా, చంద్రబాబు నివాసంపై దాడికి యత్నించిన ఘటనలో జోగి రమేశ్‌కు నోటీసులు ఇచ్చి విచారణ చేస్తున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి కేసులోనే దేవినేని అవినాశ్‌కు బుధవారం పోలీసులు నోటీసులు జారీ చేయగా, మాజీమంత్రి, గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని కూడా లిస్టులో చేరారు. కేసినోకు వ్యతిరేకంగా నిజనిర్ధారణకు వచ్చిన టీడీపీ బృందంపై హత్యాయత్నానికి పాల్పడిన కొడాలి నాని, ఆయన అనుచరులపై కేసును తిరగదోడుతున్నారు. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, పట్టాభి ఇంటిపై దాడితో పాటు చెన్నుపాటి గాంధీ కన్ను పొడిచేసిన వైసీపీ నాయకుల చిట్టా కూడా లాగుతున్నారు.

– (విజయవాడ-ఆంధ్రజ్యోతి)



జోగి కుటుంబానికి బిగిసిన ఉచ్చు

2021, సెప్టెంబరులో చంద్రబాబు ఇంటిపై అప్పటి వైసీపీ ఎమ్మెల్యే జోగి రమేశ్, ఆయన అనుచరులు దాడి చేసేందుకు యత్నించారు. ఎన్ఎస్‌జీ భద్రతలో ఉన్న చంద్రబాబు ఇంటిపై దాడి చేయడాన్ని అప్పట్లోనే తీవ్రంగా పరిగణించారు. కానీ, అప్పటి వైసీపీ ప్రభుత్వం ఒత్తిళ్లతో ఈ కేసు నీరుగారిపోయింది. తాజాగా ఈ కేసుపై పోలీసులు దృష్టి సారించారు. జోగి రమేశ్‌కు నోటీసులు ఇచ్చి విచారణ చేస్తున్నారు. విచారణకు జోగి సహకరించడం లేదని పోలీసులు చెబుతున్నారు. ఇదే కొనసాగితే ఆయన్ను అరెస్టు చేసే అవకాశం లేకపోలేదు. ఈ దాడి ఘటనలో జోగి రమేశ్ బినామీగా ప్రచారంలో ఉన్న బంటుమిల్లి మండల జెడ్పీటీసీ భర్త మల్లిశెట్టి రాజబాబు ప్రధాన పాత్రధారి. ఈయన ప్రస్తుతం బంటుమిల్లి మండల వైసీపీ కన్వీనర్‌గా ఉన్నారు. ఈయన తన అనుచరులతో కలిసి పెద్ద ఎత్తున చంద్రబాబు ఇంటి వద్దకు కార్లలో వెళ్లి హడావిడి చేశారు. జోగి రమేశ్ మరో ముఖ్య అనుచరుడు మట్టా నాగబాబు కూడా చంద్రబాబు ఇంటిపై దాడిలో కీలకంగా వ్యవహరించారు. వీరిద్దరినీ కూడా పోలీసులు విచారణ చేసే అవకాశాలు ఉన్నాయి.

దేవినేని అవినాశ్‌కు నోటీసులు




టీడీపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి ఘటనలో దేవినేని అవినాశ్‌కు పోలీసులు నోటీసులు ఇచ్చారు. టీడీపీ నాయకుడు పట్టాభి ఇంటిపై దాడి ఘటనలోనూ అవినాశ్ ఆయన అనుచరులను విచారించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. టీడీపీ నగర నాయకుడు చెన్నుపాటి గాంధీపై దాడి ఘటనలో గద్దె కల్యాణ్, ఈశ్వర్రప్రసాద్ తదితరులను పోలీసులు అరెస్టు చేశారు. వీరితోపాటు టీడీపీ నాయకుడు పట్టాభి ఇంటిపై దాడి కేసును కూడా పోలీసులు పునర్విచారణ చేపట్టాలని నిర్ణయించారు.

వంశీకి కేసుల భయం

గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని కేసుల భయం వెంటాడుతోంది. ఆయన ప్రధాన అనుచరులు ఓలుపల్లి మోహనరంగా, భీమవరపు యేతేంద్ర రామకృష్ణ, ముల్పూరి ప్రభుకాంత్‌తో పాటు వంశీ పేరును కూడా పోలీసులు ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. వీరిలో ఇప్పటికే పలువురిని అరెస్టు చేసి జైలుకు పంపగా, మిగిలినవారు పరారీలో ఉన్నారు. వంశీ ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ దాడిలో వంశీ కీలకపాత్రధారిగా పోలీసులు చెబుతున్నారు. ఈ కేసుతో పాటు గన్నవరానికి చెందిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాసర్నేని రంగబాబుపై దాడి కేసును కూడా పోలీసులు పునర్విచారణ చేసేందుకు సిద్ధమవుతున్నారు. వాస్తవానికి ఈ కేసులో వంశీ కీలక పాత్రధారి అయినా అప్పట్లో పోలీసులపై ఒత్తిళ్లు తెచ్చి ముగ్గిరాల చిరంజీవి అనే దళితుడిని నిందితుడిగా చూపి తప్పించుకున్నారు.

కొడాలి నానిని వెంటాడుతున్న కేసినో



గుడివాడలో 2022, జనవరిలో సంక్రాంతి సందర్భంగా భారీ ఎత్తున కేసినో నిర్వహించిన అప్పటి వైసీపీ ఎమ్మెల్యే కొడాలి నాని ఆ తర్వాత కేసినోపై నిజనిర్ధారణ చేసేందుకు వచ్చిన టీడీపీ నాయకులపై దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో కొడాలి నాని ప్రధాన సూత్రధారి కాగా, ఆయన అనుచరులు దుక్కిపాటి శశిభూషణ్, మెరుగుమాల కాళీ, మట్టా జాన్‌విక్టర్ తదితరులు కీలకంగా వ్యవహరించారు. టీడీపీ నిజనిర్ధారణ బృందంపై దాడి చేయాలన్న పక్కా ప్రణాళికతో వీరంతా కలిసి సుమారు 2 వేల మంది వైసీపీ కార్యకర్తలను కె కన్వెన్షన్‌లో సమావేశపరిచారు. ఈ దాడి ఘటనకు సంబంధించిన కేసును పోలీసులు పునర్విచారణ చేపడుతున్నారు. దాడిలో పాల్గొన్న వారందరిపైనా చర్యలకు ఉపక్రమిస్తున్నారు. ఆ తర్వాత గుడివాడ టీడీపీ నాయకుడు రావి వెంకటేశ్వరరావును చంపేస్తానని బెదిరించడమే కాకుండా, ఆ పార్టీ కార్యాలయం పైకి కత్తులు, కర్రలతో దూసుకెళ్లి, పెట్రోల్ ప్యాకెట్లు విసిరిన వైసీపీ నాయకుడు మెరుగుమాల కాళీ తదితరులపై అప్పట్లో హత్యాయత్నం సెక్షన్లు కాకుండా బెయిల్‌కు వీలైనట్టుగా కేసు పెట్టారు. ఈ కేసును తిరగదోడి కాళీపై హత్యాయత్నం కేసు నమోదు చేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారు.

ఇదేంది సామీ!

- సకలేశ్వరస్వామి ఆలయం పునఃనిర్మాణంపై అవినీతి మరకలు
- తాజాగా ఆలయంలో ఇత్తడి మాయం
- 35 కిలోల తొడుగులు అపహరణకు గురైనట్టు కేసు
- అభివృద్ధి కమిటీ పేరుతో చక్రం తిప్పిన వైసీపీ నేతలు
- రెండేళ్ల నుంచి అవినీతిపై ఫిర్యాదులు చేస్తున్న లుక్కా
- అతనిపైనే కేసు పెట్టిన అప్పటి అసిస్టెంట్ కమిషనర్ శాంతి



తోట్లవల్లూరు మండలం రొయ్యూరు సకలేశ్వర స్వామి దేవస్థానం పునఃనిర్మాణంలో ఒకపక్క అవినీతి ఆరోపణలు వెల్లు వెత్తుతున్న తరుణంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఆలయానికి చెందిన 35 కిలోల ఇత్తడి మాయమైనట్టు పోలీసులకు ఈవో ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వంలో మాజీ మంత్రి జోగి రమేష్, వైసీపీ నేత విజయసాయిరెడ్డి అండదండలతో ఆ పార్టీ నేతలు అనధికార కమిటీని ఏర్పాటు చేసి అవినీతికి పాల్పడ్డారని గ్రామస్తుడు లుక్కా వెంకట శ్రీనివాసరావు రెండేళ్ల నుంచి చేస్తున్న ఆరోపణలు నిజమేనని చర్చ నడుస్తోంది.

తోట్లవల్లూరు, ఆగస్టు 22 : రొయ్యూరు సకలేశ్వరస్వామి దేవస్థానం జీర్ణోద్ధరణ కావటంతో గత వైసీపీ ప్రభుత్వంలో 2022 ఆగస్టు 21వ తేదీన దేవదాయశాఖ సర్వశ్రేయో నిధి నుంచి మంజూరైన రూ.75 లక్షలతో ఆలయ పునః నిర్మాణం చేపట్టారు. కాంట్రాక్టర్ నిర్మాణాన్ని పూర్తి చేయలేదని, రూ.75 లక్షలు ఖర్చయిపోయాయని వైసీపీ నేతలు తెరమీదకు తెచ్చి ఆయన్ను తప్పించారు. అనధికార కమిటీని నియమించి భారీగా విరాళాలు వసూలు చేసి వాటిల్లో అవినీతి పాల్పడ్డారని బీసీ నేత లుక్కా వెంకట శ్రీనివాసరావు కలెక్టర్ నుంచి దేవదాయశాఖ అధికారుల వరకు రెండేళ్లుగా ఫిర్యాదు చేస్తూ వచ్చారు. వైసీపీ నేతలకు నాటి మంత్రి జోగి రమేష్, ఎంపీ విజయసాయిరెడ్డి అండదండలున్నాయని, దీంతో ఆలయ ఈవో సెలవుపై వెళ్లగా మరొక ఈవో వచ్చి అధికార పార్టీ నేతలకు సహకరించారని లుక్కా ఆరోపిస్తున్నారు. తన ఫిర్యాదులపై నాటి దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న శాంతి మూడుసార్లు రొయ్యూరు ఆలయానికి వచ్చి విచారించి బ్లాక్‌మెయిల్ చేస్తున్నానని తనపైనే కేసు పెట్టించారని శ్రీనివాసరావు చెప్పారు. 2024 సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా మార్చిలో వైసీపీ నేతలు హడావిడిగా ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించారని, ఆలయాన్ని ప్రారంభించాక దేవదాయశాఖ అధికారులు రూ.75 లక్షలతో 2023లోనే ఆలయ నిర్మాణాన్ని పూర్తిచేసినట్టు శిలాఫలకం వేశారని చెబుతున్నారు. ఈయన ఆరోపణలు చేస్తున్న క్రమంలో ఈ నెల 19న దేవదాయశాఖ కమిషనర్ సంధ్యారాణి రొయ్యూరు ఆలయానికి విచారణకు వచ్చారు. ఈ నేపథ్యంలో పాత ధ్వజస్తంభం ఇత్తడి తొడుగులు లేని విషయం బయటకు వచ్చింది. ఇవి 35 కిలోలు ఉంటాయని చెబుతున్నారు.

● అవినీతికి అధికారులే సహకరించారు



సకలేశ్వరస్వామి ఆలయంలో అవినీతి అక్రమాలకు దేవదాయశాఖ అధికారులే సహకరించారు. కొత్త ధ్వజస్తంభం నుంచి అనేక అక్రమాలు జరిగాయి. ఈ అక్రమాలన్నింటిపై గతంలో కలెక్టర్‌కు, దేవదాయ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఉపయోగం లేదు.

– లుక్కా వెంకట శ్రీనివాసరావు

● ఇత్తడి మాయంపై కేసు

పాత ధ్వజస్తంభం ఇత్తడి తొడుగులను స్టోర్ రూమ్‌లో పెట్టాం. ఇపుడు 35 కిలోల ఇత్తడి తొడుగులు లేవు. ఏమయ్యాయో తెలయటం లేదు. దీంతో తోట్లవల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశా.

– ఈవో కె.సుపద్మా దేవి

గంజాయి పోవాలి.. చోరీలు ఆగాలి



కొత్త సీఐలకు పాత సవాళ్లు

- గత ఐదేళ్లు గంజాయికి కేంద్రంగా గుడివాడ
- ఎక్కడబడితే అక్కడే విచ్చలవిడిగా విక్రయం
- కొత్త ప్రభుత్వంలో పట్టుబడుతున్న గంజాయి
- ఈ క్రమంలోనే బయటపడిన వినూత్న చోరీలు

వైసీపీ పాలనలో గంజాయి విచ్చలవిడిగా దొరికేది. గుడివాడ గంజాయి అమ్మకాలకు కేంద్రంగా మారింది. 'ఇందుగలదు అందు లేదన్న సందేహం లేదు ఎందెందు వెదికినా అందందే గలదు' అన్నట్టు కళాశాలలు, శివారు ప్రాంతాలు, ఫ్లైఓవర్ కింద, టిడ్కో, జగనన్న కాలనీలల్లో సులువుగా గంజాయి దొరికేది. దీనితోపాటు దొంగతనాలూ ఇక్కడ ఎక్కువయ్యాయి. గంజాయి సేవించి దొంగతనాలు, దోపిడీలకు పాల్పడుతున్నారు. ఇటీవల వరుస దాడులతో కిలోల మేర గంజాయి పట్టుబడింది. ఆ క్రమంలో బైక్‌ల చోరీలు వెలుగులోకి వచ్చాయి. ఈ రెండిటినీ నివారించడం ఇప్పుడు కొత్త సీఐలకు సవాల్‌గా మారింది.

ఆంధ్రజ్యోతి - గుడివాడ : కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పూర్తిస్థాయిలో పోలీస్ శాఖలో ప్రక్షాళన చేపట్టింది. ఇందులో భాగంగా గుడివాడకు ముగ్గురు కొత్త సీఐలు బదిలీపై వచ్చారు. గుడివాడ వన్‌టౌన్, టూటౌన్, తాలూకా సీఐలకు పాత సవాళ్లు స్వాగతం పలుకుతున్నాయి. విచ్చలవిడిగా సాగుతున్న గంజాయి అమ్మకాల నివారణ, రవాణ ముసుగులో దొంగతనాలు నిర్మూలన కత్తిమీద సామేనని చర్చ నడుస్తోంది.

● సొంత బైక్‌లు వాడకుండా..

గంజాయి రవాణకు ముఖ్యంగా ద్విచక్ర వాహనాలను వినియోగిస్తున్నారు. నిమిషాల వ్యవధిలో పట్టణ, శివారు ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలు మాయమవుతున్నాయి. గంజాయి రాకెట్‌లోని యువకులు వినూత్నంగా రవాణకు తెరలేపారు. ముందుగా అనుకున్న ప్రకారం ఎవరో ఒకరి బైక్‌ను దొంగిలించి, దానిలో పెట్రోలు ఎంతవరకు వస్తే అంత వరకు ప్రయాణం చేసి, ఆగిన చోటనే బైక్‌ను వదిలేసి ఆ దరిదాపుల్లోని మరో ద్విచక్రవాహనాన్ని దొంగిలిస్తారు. ఇదే ప్రక్రియను గంజాయి కొనుగోలు నుంచి తిరుగు ప్రయాణంలో కూడా అవలంబిస్తుంటారు. ఒక్కో సందర్భంలో బైక్‌లు జిల్లాలు దాటించేస్తున్నారు. ఇటీవల గుడివాడ తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో శ్రీకాళహస్తి కాలనీ వద్ద 6.250 కిలోల గంజాయిని పట్టుబడిది. నిందితులను విచారిస్తే గంజాయి రవాణతో పాటు బైక్ దొంగతనాలు విషయం బయటపడింది. వీరందరూ మైనర్‌లు కావడం విశేషం. గంజాయి రాకెట్ తెలివికి పోలీసులు ఆశ్చర్యపోయారు. గంజాయి విక్రేతలు ఎక్కడా తమ సొంత బైక్‌లను వాడకుండా జాగ్రత్త తీసుకుంటారు.

● గంజాయి రవాణ ఇలా?

తక్కువ సమయంలో ఎక్కువ సంపాదన ఆశలో యువత గంజాయి అమ్మకాలకు పాల్పడుతున్నారు. గంజాయి రవాణ ముసుగులో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నట్టు సమాచారం. ఎవరి బైక్ అయినా సరే కొట్టేయడం, పెట్రోలు ఖాళీ అవ్వగానే వాటిని వదిలేసి, వేరే బైక్ చోరీ చేసి ముందుకు వెళ్లడం వీళ్ల పని. బయలుదేరిన నాటి నుంచి తిరిగి వచ్చే వరకు బైక్‌లను దొంగిలించి వాడుకుంటారు. గతంలో ఇక్కడ పనిచేసిన సీఐ ఒకరు గంజాయి విక్రేతలకు అండగా ఉన్నారని పోలీసు వర్గాల్లో చర్చ నడుస్తోంది.



నూతన పద్ధతిలో బైక్‌ల చోరీలు

గంజాయి రవాణ, బైక్ దొంగతనాలకు లింకుందా?

ఇటీవల పట్టుబడిన గంజాయి విక్రేతలను పోలీసులు తమ స్టైల్‌లో విచారిస్తే బైక్‌ల దొంగతనం విషయం బయటపడింది. దీనిపై ఎస్పీ పూర్తిస్థాయిలో దృష్టి సారించి దర్యాప్తు చేస్తే గంజాయి రవాణాను సాధ్యమైనంత మేర అరికట్టే అవకాశాలున్నాయి. నియోజకవర్గానికి వచ్చిన ముగ్గురు కొత్త సీఐలు సమన్వయంతో కదిలితే గంజాయితో పాటు బైక్ దొంగతనాల రాకెట్‌ను ఛేదించవచ్చు.

బైక్‌లు మాయం

వారం రోజుల క్రితం గుడివాడ మండలం మల్లాయిపాలెంలో అర్ధరాత్రి ఇంటి ముందు పార్కు చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. దొంగలు సదరు యువకుడి ఇంటికి కూతవేటు దూరంగా మరో బైక్‌ను వదిలివెళ్లారు. రెండు రోజులు పాటు యువకుడు, పోలీసులు బైక్ ఆచూకీ కోసం తీవ్రంగా శ్రమించారు. గుడివాడ టూటౌన్ స్టేషన్ పరిధిలోని నైజాంపేటలో అనుమానాస్పదంగా రెండు రోజుల నుంచి బైక్ పార్కు చేసి ఉండటాన్ని గమనించి స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మల్లాయిపాలేనికి చెందిన యువకుని బైక్ అక్కడ లభ్యమైంది. అదే సమయంలో ఆ ప్రాంతానికి చెందిన మరో బైక్ చోరీకి గురైంది. ఇదే తరహాలో పట్టణ శివారు ప్రాంతంలో ఇంటి ముందు పార్కు చేసిన బైక్ దొంగతనానికి గురైంది. బైక్ యజమాని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వేరే పని మీద పట్టణంలో మార్కెట్ వద్ద వెళ్లగా అక్కడ తన బైక్‌ను చూసి ఆశ్చర్యపోయాడు. బైక్ తీసుకువచ్చిన వ్యక్తిని నిలదీయగా తనకు తెలియదని, బయటకు వెళ్లి వస్తానంటే తన ఫ్రెండ్ బైక్ ఇచ్చాడని చెప్పి జారుకున్నాడు. పోయిన బైక్ దొరకడంతో యువకుడు ఊపిరి పీల్చుకున్నాడు. గత మూడేళ్లలో ఇలాంటి సంఘటనలు చాలా జరిగాయి. గత వైసీపీ పాలనలో పోలీస్ శాఖ దొంగతనాలను నివారించడంలో విఫలమవ్వడంతో దొంగతనాలు విపరీతంగా పెరిగాయి.

ఏడేళ్లుగా ఎదురుచూపులే..

టిడ్కో గృహాలు పేదలకు ఇచ్చేదెన్నడో..

- రుద్రవరంలో నిర్మాణ పనులు నత్తనడకన
- ఉయ్యూరులో ఇళ్ల పనులు నిలిచి మూడేళ్లు
- మచిలీపట్నం గోసంఘంలో, గుడివాడలో గృహాలు అప్పగించినా సౌకర్యాలు శూన్యం
- మచిలీపట్నంలో నగదు చెల్లించిన లబ్ధిదారులు ఆరువేల మంది
- గృహాల నిర్మాణం చేసింది 2,300 మందికే

జిల్లాలో పేద, మధ్యతరగతి లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు ఇప్పట్లో అందే సూచనలు కానరావడం లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ గృహసముదాయాల నిర్మాణాలను ప్రారంభించి 65 శాతంపైగా పనులు పూర్తి చేస్తే వైసీపీ అధికారంలోకొచ్చాక రివర్స్ టెండరింగ్ పేరుతో నిలిపివేసింది. అప్పటి నుంచి నత్తనడకన ఈ గృహసముదాయాల నిర్మాణం జరుగుతోంది. దీంతో లబ్ధిదారులకు ఏడేళ్లుగా ఎదురుచూపులే మిగిలాయి. కొన్నిచోట్ల గృహ సముదాయాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించినా మౌలిక వసతులు లేక అవస్థలు పడుతున్నారు.



రుద్రవరం వద్ద లబ్ధిదారులకు టిడ్కో గృహాలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఆంధ్రప్రదేశ్ టౌన్‌షిప్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిడ్కో) ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం జిల్లాలో 13,712 గృహాల నిర్మాణాలను ప్రారంభించింది. అప్పట్లోనే 65 శాతం మేర గృహ సముదాయాల నిర్మాణం పూర్తయింది. ఎన్నికల అనంతరం వైసీపీ అధికారంలోకి వచ్చాక గృహసముదాయాల పనులు నిలిపివేసింది. మూడేళ్ల క్రితం ఈ పనులను ప్రారంభించింది. గుడివాడ నియోజకవర్గం మల్లాయపాలెంలో నిర్మాణం చేసిన 8,912 గృహాలను 2022 జూన్‌లో లబ్ధిదారులకు అప్పగించారు.

● గో సంఘం వద్ద పరిస్థితి ఇదీ

మచిలీపట్నం నియోజకవర్గంలోని గోసంఘం వద్ద 864 గృహాల నిర్మాణ పనులు పూర్తయిన తరువాత ఏడాదిన్నర కాలంపాటు ఈ గృహాలను లబ్ధిదారులకు అప్పగించకుండా జాప్యం చేశారు. సార్వత్రిక ఎన్నికలముందు ఇక్కడి గృహాలను లబ్ధిదారులకు అప్పగించారు. ఇక్కడ వీధిలైట్లు వేయకపోవడంతో రాత్రి సమయంలో ఈ గృహ సముదాయాల్లో నివాసం ఉండేవారు పలు ఇబ్బందుల పాలవుతున్నారు.ఈ గృహ సముదాయం వద్ద మురుగునీటిని బయటకు పంపేందుకు డ్రెయినేజీ పనులు అసంపూర్తిగానే చేశారు.

● రుద్రవరంలో పనులు ఎప్పటికి పూర్తవుతాయో

మచిలీపట్నం నియోజకవర్గంలోని రుద్రవరంలో ముందుగా 3వేలకుపైగా టిడ్కో గృహాల నిర్మాణం కోసం పునాదులు వేశారు. వివిధ కారణాలతో ఈ గృహాల సంఖ్యను 1440కు కుదించారు. ఇక్కడి గృహాల్లో గదులకు కిటికీలు, డోర్‌లు, విద్యుదీకరణ పనులు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. ఓవర్‌హెడ్ ట్యాంకు, సంప్‌ల నిర్మాణ పనులు పూర్తయినా సగం గృహాలకు మాత్రమే పైప్‌లైన్ కనెక్షన్లు ఇచ్చారు. ఎప్పటికప్పుడు పనులు పూర్తి చేస్తామని చెప్పడమే తప్ప, త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకోలేదు. ఇక్కడ రహదారులు, డ్రెయినేజీల నిర్మాణం అస్తవ్యస్తంగానే ఉంది. దీనిపై టిడ్కో ప్రాజెక్టు పీడీ బి.చిన్నోడును వివరణ అడగ్గా మచిలీపట్నం రుద్రవరంలోని 400 టిడ్కో గృహాలకు కిటికీలు, తలుపులు బిగించే పనులు పూర్తయ్యాయి. మరో 900 గృహాలకు కిటికీలు, తలుపులు బిగించే పనులు జరుగుతున్నాయని చెప్పారు.

నగదు కట్టించుకున్నది 6000 మందితో..

మచిలీపట్నంలోని గోసంఘం, రుద్రవరంలో టిడ్కో గృహాలు ఇస్తామని గతంలో 6వేల మందితో నగదు కట్టించుకున్నారు. వీరిలో రూ.25వేల చొప్పున, రూ.12,500, రూ.500 చొప్పున కట్టారు. తొలి విడతగా లబ్ధిదారులు వారికి కేటాయించిన గృహం విస్తీర్ణాన్ని బట్టి రూ.25వేలు, రూ.12,500 చొప్పున నగదు చెల్లించారు. గృహాలు లబ్ధిదారుల పేరుతో రిజిస్ట్రేషన్ చేసేందుకు నాలుగు విడతల్లో నగదును కట్టించుకున్నారు. ఈలోగా వైసీపీ అధికారంలోకి రావడంతో ఆరువేల గృహాల నుంచి 2300 గృహాలకు కుదించారు. దీంతో నగదు చెల్లించిన 3700 మంది లబ్ధిదారుల పేరున టిడ్కో గృహాల నిర్మాణం నిలిచిపోయింది. పెనమలూరు నియోజకవర్గం, ఉయ్యూరుటౌన్ పరిధిలోని జెమినిస్కూల్, ఎగినపాడు రహదారిపక్కనే, గండిగుంట పంచాయతీపరిధిలో మూడు ప్రాంతాల్లో 2,946 టిడ్కో గృహాల నిర్మాణ పనులను నిలిపివేసి దాదాపు మూడేళ్లు కావస్తోంది.

స్టాక్ పాయింట్లలో ఇసుక అందుబాటులో లేదు | ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ

6లో.. పాత పంచదార పంపిణీకి ఆదేశాలు


ఇబ్రహీంపట్నం లే అవుట్‌ను పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే వసంత

అర్హులైన పేదలందరికీ పక్కా గృహాలు

- మంత్రి పార్థసారథి

ఇబ్రహీంపట్నం/జి.కొండూరు, ఆగస్టు 22 : 2029 నాటికి రాష్ట్రంలో ఇల్లు లేని పేదవాడు ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు పోతున్నదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా గృహాలు మంజూరు చేసి నిర్మిస్తామని ఏపీ గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్‌తో కలిసి ఆయన ఇబ్రహీంపట్నం, కొండపల్లి, జి.కొండూరు, మైలవరం పూరగుట్ట లే అవుట్‌లను గురువారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వచ్చే ఏడాది మార్చి నాటికి 1.25 లక్షల పక్కా గృహాల నిర్మాణమే ప్రధాన లక్ష్యమన్నారు. మౌలిక వసతుల కల్పనకు అమృత్, ఎన్.ఆర్.ఈ.జీ.ఎస్, జె.జె.ఎం పథకాలను అమలు చేస్తామన్నారు. గత ప్రభుత్వం చేసిన అవకతవకల వల్ల ఆర్థిక క్రమశిక్షణ ఉల్లంఘన కారణంగా గృహ నిర్మాణశాఖలో పురోగతి కుంటుపడిందన్నారు. వచ్చే ఏడాది పూర్తి నాటికి ఏడు లక్షల గృహాల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, పూరగుట్టలో బోర్లు, రహదారుల అభివృద్ధి, జంగిల్ క్లీయరెన్స్ తదితర మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. పక్కా గృహాలు మంజూరైన వారు మార్చి లోగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలన్నారు. లేకుంటే వారికి భవిష్యత్‌లో పక్కా గృహాలు మంజూరు కావన్నారు. స్థానిక సమస్యలపై స్పందించిన మంత్రి పార్థసారథికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాల్లో జంపాల సీతారామయ్య, అక్కల రామ్మోహన్‌రావు (గాంధీ), ఉయ్యూరు వెంకట నరసింహారావు, పంటాపంచల నరసింహారావు, పజ్జూరు రవికుమార్, నెల్లూరు శ్రీనివాసరావు, పాటిబండ్ల మధుసూదనరావు, నూతక్కి అపర్ణ, నూతక్కి రాజరావు, సుకవాసి శ్రీహరి, మన్నం వెంకట్రావ్, ఈమని మురళీకృష్ణ, చల్లగుండ్ల అజయ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతుల నగదు కొట్టేసిన ఐదుగురు పోలీసులపై వేటు

నందిగామ/నందిగామరూరల్ ఆగస్టు 22 : రైతుల నుంచి నగదు చోరీ చేసిన వ్యక్తి నుంచి ఆ సొమ్ము కొట్టేసిన ఐదుగురు పోలీసులను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఏసీపీ రవికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన కొందరు రైతులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మిర్చి విక్రయించి రూ. 25 లక్షల నగదుతో ఇంటికి వస్తున్నారు. మిర్చి బస్తాలు తీసుకువెళ్లిన లారీలోనే తిరిగి వస్తుండగా క్లీనర్ పల్లెపోగు కోటేశ్వరరావు డబ్బుతో పరారయ్యాడు. సొమ్ముతో ఆటోలో నందిగామ వైపు వస్తుండగా, బుధవారం రాత్రి చెక్‌పోస్టు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడితో సహా రూ.18.95 లక్షల సొమ్మును స్టేషన్‌లో అప్పగించారు. సమాచారం తెలుసుకున్న బాధిత రైతులు స్టేషన్‌కు చేరుకొని తమ నుంచి నిందితుడు రూ.25 లక్షలు చోరీ చేశాడని ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ లచ్చునాయుడు, ఎస్ఐ పండుదొరలు విచారణ జరపగా, రూ. 6లక్షలు పోలీసు సిబ్బంది కొట్టేసినట్టు నిర్ధారణకు వచ్చారు. దీంతో ఉన్నతాధికారులు బాధ్యులైన ఏఎస్ఐ బి.రుద్రరాజు, హెడ్ కానిస్టేబుల్ కె.నాగరాజు, కానిస్టేబుల్ కె.నాగబాబు, సివిల్ పోలీసులు శివ, సృజన్‌ను సస్పెండ్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఏసీపీ రవి కుమార్ తెలిపారు.


నిందితులు షేక్ కరీముల్లా, సాహిలను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

దళిత మహిళా ఎమ్మెల్యేపై మీమ్స్

- ఎన్నికలకు ముందు ఓసారి.. ఇటీవల మళ్లీ సోషల్ మీడియాలో ట్రోల్
- అట్రాసిటీ కేసు నమోదు చేసిన పోలీసులు

నందిగామ, ఆగస్టు 22 : వైసీపీ నాయకులు అవమానకరమైన మీమ్ తనపై ప్రదర్శించి తనను అవమానించి మానసిక వేదనకు గురి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య స్థానిక పోలీసులను కోరారు. శుక్రవారం ఆమె తన ఫిర్యాదును తన సోదరుడి ద్వారా నందిగామ స్టేషన్‌లో అందజేశారు. ఈ ఏడాది జనవరి నెలలో జగనన్న వాక్‌వే ప్రారంభం సందర్భంగా పట్టణానికి చెందిన వైసీపీ నాయకులు షేక్ కరీముల్లా(దుబాయ్), ఆయన కుమారుడు షేక్ సాహిలు తనపై అవమానకర మీమ్స్ ప్రదర్శించారని ఆరోపించారు. పెద్దఎత్తున ప్రజలు, మంత్రులు, శాసన సభ్యుల సమక్షంలో తనను పిచ్చిదానిగా అభివర్ణిస్తూ మీమ్స్‌ను పెద్ద స్క్రీన్‌లపై ప్రదర్శించారని పేర్కొన్నారు. సదరు మీమ్స్‌ను తప్పుడు ఫేస్‌బుక్ అకౌంట్‌ల నుంచి ప్రసారం చేసి తనను అవమానించారని పేర్కొన్నారు. దళిత మహిళనైన తనపట్ల అసభ్య, అభ్యంతరకర పోస్టులు పెట్టి వేధించారని తెలిపారు. సదరు మీమ్స్ వల్ల తీవ్ర మనోవేదన చెందానని ఫిర్యాదులో పేర్కొన్నారు. తిరిగి మరలా వారం రోజుల నుంచి అదే మీమ్స్‌ను సోషల్ మీడియా ద్వారా ప్రసారం చేస్తూ తనను, తన సోదరిని అవమానిస్తున్నారని తెలిపారు. తాము మానసిక క్షోభను అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై మనస్థాపం చెందిన తన సోదరుడు వారిని నిలదీయగా, కులం పేరుతో దూషిస్తూ అవమానించినట్టు చెప్పారు. దళిత కుటుంబానికి చెందిన మా పట్ల కరీముల్లా, అతని కుమారుడు వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరకరంగా ఉందన్నారు. వారిపైనా, వారికి సహకరిస్తున్న వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను అనారోగ్యంతో బాధపడుతున్నందున ఫిర్యాదును సోదరుడు తంగిరాల శ్రావణ్ ద్వారా పంపుతున్నట్టు పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు కరీముల్లా, అతని కుమారుడిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు సీఐ లచ్చునాయుడు తెలిపారు.

మునిసిపల్ కమిషనర్లు వీరే..

మచిలీపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని మునిసిపాలిటీల్లో కమిషనర్లను నియమిస్తూ, బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం జీవోఆర్‌టీ నెంబరు 655ను జారీ చేసింది. మాచర్ల మునిసిపాలిటీలో మేనేజరుగా పనిచేస్తున్న ఈవీ రమణబాబును ఎన్టీఆర్ జిల్లా నందిగామ మునిసిపాలిటీ కమిషనర్‌గా నియమించారు. తాడేపల్లిగూడెం మునిసిపాలిటీలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న గోపాలరావును పెడన పురపాలక సంఘం కమిషనర్‌గా నియమించారు. పెడన మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న వెంకట రామయ్యను మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎస్.శివరామకృష్ణను తాడిపత్రి మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు.

పాత పంచదార పంపిణీకి ఆదేశాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పాత పంచదారను పేదలకు పంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. 'పంచదార పంచుతారా' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనంపై ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. తూకంలో తేడాలుండటంతో ఆ పంచదార పంపిణీని నిలిపివేసిన సంగతి తెలిసిందే. దీనిపై విచారణ జరపమని తూనికల కొలతల శాఖకు గతంలోనే ఆదేశించారు. తేడాలున్న విషయాన్ని గుర్తించిన ఆ శాఖ ప్రభుత్వానికి నివేదిక కూడా అందించింది. ఈ క్రమంలో ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో ప్రభుత్వం స్పందించింది. పాత పంచదార పాడవకుండా కార్డుదారులకు అందించాలని గురువారం ఆదేశాలిచ్చింది.

సైబర్ నేరాలపై అప్రమత్తం : డీఎస్పీ



కోడూరు, ఆగస్టు 22 : యూపీ నుంచి ముసుగు దొంగలు వచ్చినట్టు సమాచారం ఉందని నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ తెలిపారు. గురువారం కోడూరు స్టేషన్ వద్ద ప్రాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు వ్యవసాయ పనులకు వెళ్లేటప్పుడు ఇంటి తాళాలు జాగ్రత్త పర్చుకోవాలని, వీలైనంత వరకు ఇంటి వద్ద వ్యాపార సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. స్మార్ట్ ఫోన్ వినియోగదారులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులు సోషల్ మీడియా ద్వారా పంపిన లింకులను ఓపెన్ చేయవద్దని తెలిపారు. పేకాట, కోడిపందాలు నిర్వహించినా, మద్యం, రేషన్ బియ్యం, అక్రమ ఇసుక రవాణా, అక్రమ ఇసుక నిల్వలు ఉంచిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇల్లీగల్ యాక్టివిటీస్ నిర్వహించే వారి సమాచారాన్ని ప్రజలు పోలీసులకు అందించాలని కోరారు.

మంచంపట్టిన పల్లెలు!

- గ్రామాల్లో పెరుగుతోన్న జ్వర పీడితులు
- కీళ్లనొప్పులు, రక్త కణాల తగ్గుదలతో బాధితుల భయాందోళన
- గ్రామాల్లో అధ్వానంగా పారిశుధ్యం
- ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలంటున్న ప్రజలు


మైలవరం, పొందుగలలో జ్వర బాధితులు, చంద్రగూడెంలో రోడ్డుపైనే మురుగునీరు

మైలవరంరూరల్, ఆగస్టు 22 : మండలంలోని పలు గ్రామాలు మంచాన పడ్డాయి. వర్షాకాలం, వాతావరణంలో మార్పులు కారణంగా అంతుచిక్కని వైరస్‌తో జ్వరాల బారినపడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. గత


పొందుగలలో మురుగునీటి చెంతనే.. తాగునీరు

వారంరోజుల నుంచి మండలంలో పరిస్థితి దారుణంగా తయారైంది. ప్రజలు జ్వరం బారినపడి మంచం దిగలేని స్థితిలో ఉంటున్నారు. మండలంలోని పుల్లూరు, మొర్సుమిల్లి, గణపవరం, పోరాట నగర్ తండా, కీర్తిరాయునిగూడెం, చంద్రాల, చంద్రగూడెం, పొందుగల, అనంతవరం తదితర గ్రామాల్లో జ్వర బాధితులు అధికంగా ఉన్నట్టు సమాచారం. కుటుంబంలో ఒకరికి జ్వరం వస్తే చాలు రెండు మూడు రోజులకే కుటుంబం మొత్తాన్ని చుట్టేస్తున్నది. జ్వరం సోకిన వారిలో కీళ్లనొప్పులు, రక్తకణాలు తగ్గిపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి.

నిమ్మకు నీరెత్తిన వైద్య, ఆరోగ్యశాఖ

మైలవరం మండలంలో జ్వరాలు ప్రబలి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. వర్షాకాలం ప్రారంభం అయినప్పటి నుంచి గ్రామాల్లో దోమల నివారణకు అధికారుల చర్యలు శూన్యం. రెండు నెలల నుంచి కేవలం ఒక్కసారి మాత్రమే డ్రెయినేజీలో పూడికతీత, బ్లీచింగ్ చల్లడం, మలాథీన్ స్ర్పే వంటి పనులు చేశారు. జ్వరాల తీవ్రతను బట్టి వారానికోసారి పారిశుధ్య చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. అదేవిధంగా గ్రామాల్లో జ్వరపీడితులను గుర్తించేందుకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఇంటింటి సర్వే చేయడంతో పాటు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంలో విఫలమయ్యారు. కేవలం రెండు మూడు గ్రామాల్లో మాత్రమే శిబిరాలు ఏర్పాటు చేసి మమ అనిపించారు. జ్వరపీడితులు ప్రైవేట్ వైద్యశాలలకు క్యూ కడుతున్నారనే సమాచారం ఉన్న అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి జ్వరపీడితులు మైలవరంలోని ఆర్ఎంపీ వైద్యుల వద్ద బారులుతీరుతున్నారు. జ్వరాలతో ఇబ్బందులు పడుతున్న వారిలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారే అధికంగా ఉండటంతో వైద్య ఖర్చులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీజనల్ వ్యాధులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా అంతుచిక్కని వైరస్‌తో జ్వరం బారినపడి నానా పాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా విషజ్వరాలపై సంబంధిత అధికారులు స్పందించి ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించాలని జ్వరపీడితులు కోరుతున్నారు.

పామర్రుకు ఫీవర్

పామర్రు : పట్టణంలో ప్రజారోగ్యం పడకేసింది. పలు కాలనీల్లో దోమల ఉధృతి వల్ల ప్రజలు రోగాలబారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. కొత్తపేట ఏరియాకు చెందిన నలుగురు డయేరియాతో ఎస్-2 ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.బాపూజీపేటకు చెందిన పి.హేమ(26), పి.వర్షిణి (11), పి.రాంబాబు (46), డి.డానియేల్ (5), నాగరాజు (27) కూర్మాపురానికి చెందిన కె.సుబ్రమణ్యం(41), డి.విజయలక్ష్మి(58) జ్వరాలతో బాధపడుతున్నారు. వీరితో పాటు ధనాల నాగేశ్వరరావు (58), మంచాల రాము(64), వెన్నా లక్ష్మికుమారి(59), బయలపాటి శిరీష (21) విజయవాడ, బందరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. డెంగ్యూ, వైరల్ ఫీవర్స్ విజృంభించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కాగా, ఎమ్మెల్యే కుమార్ రాజా వైద్య ఆరోగ్య శాఖను అప్రమత్తం చేశారు. ప్రజా ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులను ఆదేశాలు ఇచ్చారు. అవసరమైతే గ్రామంలో వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఏర్పా టు చేసి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని సూ చించారు. పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ సలీం అన్ని వాటర్ ట్యాంకుల నీటి శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపారు.

డెంగ్యూ కేసులు మా దృష్టికి రాలేదు : డాక్టర్ రాజేష్



గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న 25 మం దికి రక్త పరీక్షలు నిర్వహించినట్లు కనుమూరు పీహెచ్‌సీ వైద్యుడు పి.రాజేష్ తెలిపారు. కొందరికి వైరల్ ఫీవర్లు ఉన్నట్లు తెలిపారు. అవసరమైన వారికి చికిత్స అందిస్తున్నామని, కొందరు విజయవాడ, మరికొన్ని చోట్ల ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. డెంగ్యూ కేసులు నమోదు కాలేదన్నారు.


వినతిపత్రాన్ని విడుదల చేస్తున్న సీపీఎం నేతలు

మరో ఉద్ధానంలా ఎన్టీఆర్ జిల్లా మండలాలు

- సీపీఎం నేతలు బాబూరావు, డీవీ కృష్ణ

గవర్నర్‌పేట, ఆగస్టు 22 : ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు, గంపలగూడెం, తిరువూరు, విసన్నపేట, మైలవరం తదితర మండలాల పరిధిలోని చాలా గ్రామాల్లో కిడ్నీ వ్యాధితో వందల మంది పిట్టల్లా రాలిపోతూ మరో ఉద్ధానంలా తయారైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ముఖ్యమంత్రి అఖిలపక్ష కమిటీ సమావేశం ఏర్పాటు చేసి, సమగ్రంగా చర్చించి, శాశ్వత పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం శ్రీశ్రీ భవన్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ, ఇతర నాయకులతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శుద్ధి చేసిన కృష్ణా నీటిని కుళాయిల ద్వారా ఇంటింటికీ అందించాలని, కిడ్నీ బాధితులకు ప్రతి నెలా రూ. 5 వేలు పెన్షన్ ఇవ్వాలని, కిడ్నీ ఆసుపత్రిని వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 24న మండల కేంద్రమైన ఎ.కొండూరులో ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎ.కొండూరు, గంపలగూడెం మండల పరిధిలోని అనేక గ్రామాల్లో ప్రజారోగ్యం క్షీణిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మరో ఉద్ధానంలా తయారైన ఎ.కొండూరు ప్రాంతంలో పదేళ్లలో 300 మంది కిడ్నీ వ్యాధితో చనిపోయారని, జిల్లా వ్యాప్తంగా ఐదువందల మంది కిడ్నీ వ్యాధితో మృత్యువాత పడ్డారని తెలిపారు. చికిత్స పొందుతున్న వారు రెండు వేలకు పైగా ఉన్నారని పేర్కొన్నారు. ఉద్ధానం తరువాత అత్యధిక మంది కిడ్నీ వ్యాధితో మృతి చెందిన వారు ఎ.కొండూరు మండలంలోనే ఉన్నారని తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ మాట్లాడుతూ, తమ బృందాలు ఆయా ప్రాంతాల్లో గత వారంరోజుల పాటు పర్యటించి తాజా పరిస్థితులపై అధ్యయనం చేయడం జరిగిందని తెలిపారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులను ఆదుకోవాలని కోరుతూ ఈనెల 24న నిర్వహించే ధర్నాలో పెద్ద ఎత్తున బాధిత ప్రజలు పాల్గొనాలని కోరారు. కిడ్నీ బాధితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో పీవీ ఆంజనయులు, కోటా కళ్యాణ్, ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా కిడ్నీ వ్యాధిగ్రస్తుల సమాచార జాబితాను విడుదల చేశారు.

ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

కృష్ణలంక, ఆగస్టు 22 : జిల్లా పరిధిలోని వివిధ ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జిసృజన అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జేసీ నిధి మీనాతో కలిసి జాతీయ రహదారులు రైల్వేలకు సంబంధించి వివిధ ప్రాజెక్టులకు భూ సేకరణ ప్రక్రియపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఎన్‌హెచ్-165



జీ-గ్రీన్‌ఫీల్డ్ అలైన్‌మెంట్, ఎన్‌హెచ్ఏఐ-216 హెచ్(పెడన-విసన్నపేట), ఎన్‌హెచ్-16 (బెంజిసర్కిల్ సర్వీసురోడ్డు), ఎన్‌హెచ్-65 (నందిగామ-కంచికచర్ల బైపాస్), ఎన్‌హెచ్-221 (విజయవాడ-భద్రాచలం), ఎన్‌హెచ్-65 (విజయవాడ-హైదరాబాద్ సెక్షన్)లకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియపై ఆమె చర్చించారు. భూ సేకరణ విస్తీర్ణం, అవార్డు పాస్ వివరాలతో పాటు ప్రస్తుతం ప్రక్రియ ఏ దశలో వుందనే వివరాలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల ఆర్డీవోలు, తహసీల్దార్లతో చర్చించారు. గడువులోగా ప్రక్రియను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా రైల్వేలో బిజీ లైన్లు, ఆర్‌ఓబీలు, డబ్లింగ్ పనులు తదితరాలకు సంబంధించి భూ సేకరణకు ఇప్పటివరకు వచ్చిన అభ్యర్థనలు, రావాల్సిన వాటిపైనా సమావేశంలో చర్చించారు. సేకరణ ప్రక్రియను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవోలు బీహెచ్ భవానీశంకర్, ఎ.రవీంద్రరావు, కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, ఎన్‌హెచ్ఏఐ, రైల్వే అధికారులు, సంబంధిత తహసీల్దార్లు తదితరులు హాజరయ్యారు.

అమ్మకు గుర్తుగా.. ఒక మొక్క

- 'ఏక్ పెడ్ మా కే నామ్' నినాదంతో పర్యావరణాన్ని రక్షిద్దాం

కృష్ణలంక, ఆగస్టు 22 : మానవాళి మనుగడకు పర్యావరణ పరిరక్షణ ఏకైక మార్గమని తల్లిపై వున్న ప్రేమ, గౌరవానికి స్ఫూర్తిగా 'ఏక్ పెడ్ మా కే నామ్' నినాదంతో ప్రతి ఒక్కరూ మొక్కను నాటి సంరక్షించడం ద్వారా కాలుష్య రహిత భవిష్యత్తుకు దోహదపడిన వారవుతామని కలెక్టర్ జి.సృజన అన్నారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా కేంద్రం అధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఏక్ పెడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగంగా గురువారం కలెక్టర్ సృజన ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి మొక్కను నాటారు. 2025 మార్చి నాటికి దేశవ్యాప్తంగా 140 కోట్ల మొక్కలను నాటాలనే లక్ష్యంతో దేశ ప్రధాని సూచన మేరకు కేంద్ర ప్రభుత్వం 'ప్లాంట్ ఫర్ మదర్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ వారి తల్లిపై వున్న ప్రేమ ఆప్యాయత అనురాగానికి గుర్తుగా ఒక మొక్కను నాటడం ద్వారా తల్లిని గౌరవించుకోవాలన్నారు. 'ప్లాంట్ ఫర్ మదర్' కార్యక్రమం ద్వారా జిల్లావ్యాప్తంగా విద్యార్థులతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు.

జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జె.సునీత మాట్లాడుతూ, ఉపాధి పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటి సంరక్షిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కొబ్బరి, మామిడి, జామ, నిమ్మ, సపోట, నారింజ,


మొక్క నాటే కార్యక్రమంలో కలెక్టర్ సృజన

సీతాఫలం, నేరేడు వంటి ఫల మొక్కలతో పాటు మల్లె, గులాబి, మందారం తదితర పూలమొక్కలను నాటి విద్యార్థులను పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములను చేస్తున్నట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో రామకృష్ణ నాయక్, గ్రామ సర్పంచ్ బి.కవిత, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.సుధారాణి, జిల్లా నీటి యాజమాన్యం సంస్థ ప్లాంట్ మేనేజర్ కె.ఉషా, ఏపీవో ఎం.ప్రమీల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రముఖ ఇంజనీరు సీతారామయ్య మృతి



ఆటోనగర్, ఆగస్టు 22 : ఏపీ విద్యుత్ సంస్థ విశ్రాంత చీఫ్ ఇంజనీర్ సూరపనేని సీతారామయ్య(86) గురువారం మృతిచెందారు. కంకిపాడు మండలం మారేడుమాకలో రైతు కుటుంబంలో కేశవనారాయణ, సరస్వతమ్మ దంపతులకు ఆయన 1939లో జన్మించారు. బెంగళూరులో బీఈ ఎలక్ట్రికల్ పూర్తి చేసి 1960 నుంచి 1996 వరకు వివిధ హోదాల్లో పనిచేసి కన్‌స్ట్రక్షన్ కింగ్ నార్ల తాతారావు వంటి దిగ్గజాలతో అనేక ప్రశంసలు అందుకున్నారు. విజయవాడ విద్యుత్ థర్మల్ కేంద్రం 4, 5 యూనిట్లను రికార్డు స్థాయిలో 18నెలల తక్కువ కాలంలోనే పూర్తి చేసి నాటి స్పీకరు బాలయోగి చేతుల మీదుగా యోగ్యతా పత్రాన్ని పొందారు. దీనివల్ల రాష్ట్ర ఖజానాకు సుమారు రూ.250 కోట్లు ఆదా అయింది. రిటైరైన తర్వాత కూడా నిర్మాణ దక్షతతో అనేక కంపెనీలలో పని చేశారు. కొండపల్లి లాంకో పవర్‌స్టేషన్, కేంద్రమంత్రి గడ్కరీకి చెందిన పవర్‌ప్లాంటు, రాజస్థాన్‌లోని సూరత్‌గఢ్ ప్లాంటు, పానిపట్ పవర్‌ప్లాంట్లు ఈయన ఆధ్వర్యంలోనే పూర్తవడం విశేషం. ఈ ఏడాది మారేడుమాకలో 33కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి సోదరుడు, ప్రముఖ డయాబెటాలజిస్ట్ డాక్టర్ రామబ్రహ్మంతో కలిసి భూమిని దానం చేశారు. సీతారామయ్యకు భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు.



నేటి నుంచే.. ఇసుక ప్రత్యేక కేంద్రాలు

- ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బుకింగ్ సౌకర్యం
- ఇన్వాయిస్ లేని వాహనాలకు స్టాక్ పాయింట్ల వద్ద అనుమతి లేదు
- 1800-599-4599, 1800-425-6029 టోల్ ఫ్రీ నెంబర్లు
- అక్రమంగా నిల్వ ఉంచినా, రవాణా చేసినా చట్టపర చర్యలు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

విజయవాడ లీగల్, ఆగస్టు 22 : త్వరలో కొత్త ఇసుక విధానం రానున్నదని, ఈలోగా ప్రస్తుత ఉచిత ఇసుక విధానాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ముఖ్యమంత్రి మార్గదర్శకాలకు అనుగుణంగా పటిష్ట చర్యలు తీసుకోవడం జరిగిందని, ఈనెల 23 శుక్రవారం నుంచి ప్రత్యేకంగా ఇసుక బుకింగ్‌కు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన వెల్లడించారు. ఉచిత ఇసుక విధానం నూతన మార్గదర్శకాలపై జాయింట్ కలెక్టర్ నిధి మీనా, డీసీపీ కేఎం మహేశ్వరరాజు, ఏసీపీ రవికిరణ్‌తో కలిసి గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉచిత ఇసుక విధానంలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు ప్రత్యేకంగా బుకింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

కీసర స్టాక్ పాయింట్ (కంచికచర్ల మండలం)కు కంచికచర్ల-3 గ్రామ సచివాలయంలోను, మొగులూరు స్టాక్ పాయింట్ (కంచికచర్ల మండలం)కు చెవిటికల్లు గ్రామ సచివాలయంలోనూ, అనుమంచిపల్లి స్టాక్ పాయింట్ (జగ్గయ్యపేట మండలం)కు షేర్ మొహమ్మద్‌పేట పంచాయతీ కార్యాలయంలో, పోలంపల్లి స్టాక్ పాయింట్ (వత్సవాయి మండలం)కు పోలంపల్లి గ్రామ సచివాలయంలోను ఇసుక బుకింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. రెవెన్యూ, పోలీస్, మైన్స్ శాఖల అధికారులు ఇప్పటివరకు చోటుచేసుకొన్న పరిణామాలను విశ్లేషించి, ఈ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. జిల్లాలో జూలైలో ఎనిమిది స్టాక్ పాయింట్లతో ఉచిత ఇసుక విధానం ప్రారంభం కాగా, ప్రస్తుతం నాలుగు స్టాక్ పాయింట్లలో ఇసుక అందుబాటులో వుందని తెలిపారు. బుకింగ్ కేంద్రాలు ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పని చేస్తాయన్నారు. ఏపీ.మైన్స్‌జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ అయిన వాహనాలకు మాత్రమే బుకింగ్ చేయడం జరుగుతుందని, అదేవిధంగా ఇన్‌వాయిస్ లేని వాహనాలను స్టాక్ పాయింట్‌ల వరకు అనుమతించడం జరగదన్నారు. బుకింగ్ సమయంలోనే స్లాట్ కేటాయించడం జరుగుతుందని, ఆవ్యవధిలోనే స్టాక్ పాయింట్‌కు వాహనాలు వెళ్లాల్సి వుంటుందన్నారు. జిల్లాస్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్‌సీ) నిర్ధారించిన రవాణా చార్జీలను బుకింగ్ కేంద్రాల వద్ద ప్రదర్శించడం జరుగుతుందని, వినియోగదారునికి రోజుకు 20 మెట్రిక్ టన్నుల వరకు మాత్రమే అందించడం జరుగుతుందన్నారు. కార్యకలాపాలు సజావుగా సాగేందుకు, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు.

నోడల్ అధికారిగా జేసీ

ఉచిత ఇసుక విధానం అమలు పర్యవేక్షణకు సంబంధించి జాయింట్ కలెక్టర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని కలెక్టర్ సృజన తెలిపారు. ఏవైనా ఫిర్యాదులు చేయాల్సి వస్తే 1800-599-4599 (రాష్ట్ర), 1800-425-6029 (జిల్లా) టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చన్నారు.

డీఎంగాంట్‌శాండ్‌కంప్లైట్స్‌ఎట్‌దిరేట్‌ఆఫ్‌యాహూ.కామ్ మెయిల్‌కు కూడా ఫిర్యాదులు పంపొచ్చన్నారు. ఫిర్యాదులను సత్వరం పరిష్కరించేందుకు ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ (పీఎంయూ) ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ సృజన తెలిపారు.

పకడ్బందీగా చెక్‌పోస్టులు : డీసీపీ

డీసీపీ (రూరల్) కెఎం మహేశ్వరరాజు మాట్లాడుతూ, ఉచిత ఇసుక విధానం పటిష్ట అమలుకు చర్యలు తీసుకోవడం జరిగిందని, అదనపు చెక్‌పోస్టులతో నిఘాను పెంచామని తెలిపారు. అక్రమంగా ఇసుక తవ్వకాలు, రవాణా జరిపినా, నిల్వ ఉంచినా చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్టు వెల్లడించారు. ఇప్పటివరకు 22 కేసులు నమోదు చేశామని, అదేవిధంగా 28 వాహనాలను సీజ్ చేసినట్టు తెలిపారు. వివిధ శాఖల అధికారుల సమన్వయంతో, మీడియా సహకారంతో ఉచిత ఇసుక విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో ఏసీపీ రవికిరణ్ పాల్గొన్నారు.

కృష్ణా జిల్లా స్టాక్ పాయింట్లలో అందుబాటులో లేదు

- ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ



మచిలీపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ అనుమతులను అనుసరించి ప్రస్తుతం కృష్ణాజిల్లాలోని ఇసుకరేవులనుంచి స్టాక్ పాయింట్ల వరకు ఇసుకను తెచ్చేందుకు అవకాశం లేదని, దీంతో జిల్లాలోని స్టాక్‌పాయింట్ల వద్ద ప్రస్తుతం ఇసుక అందుబాటులో లేదని ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ తెలిపారు. ఉచిత ఇసుక విధానం అమలుపై ప్రభుత్వం నిర్ధేశించిన మార్గదర్శకాలను వివరించే అంశంపై ఎస్పీ ఆర్.గంగాధరరరావుతో కలిసి కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో గురువారం ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కృష్ణాజిల్లాలోని స్టాక్‌యార్డ్‌ల్లో ప్రస్తుతం ఇసుక అందుబాటులో లేదన్నారు. ఇసుక కావాల్సిన వారు ఎన్టీఆర్ జిల్లాలోని కంచికచర్ల, చెవిటికల్లు, షేర్‌మహ్మద్‌పేట పంచాయతీ కార్యాలయం, పోలంపల్లిలోని స్టాక్‌పాయింట్ల నుంచి ఇసుకను తెచ్చుకోవాల్సి ఉందన్నారు. బుకింగ్ సెంటరుకు వెళ్లి, ఎంతమేర ఇసుక కావాలి, ఎక్కడివరకు రవాణాచేయాలి అనే వివరాలు తెలియజేసి రవాణాచార్జీలు, లోడింగ్ చార్జీలు చెల్లించాల్సి ఉందన్నారు. ట్రాక్టరుకు 10కిలోమీటర్లలోపు రూ.800లు, ఆరు టైర్లలారీకి రూ.1540లు, 10టైర్లలారీకి రూ.1976లు, 12టైర్ల లారీకి రూ.2500లు రవాణా చార్జీలుగా వసూలు చేయడం జరుగుందన్నారు. ఇసుక ఎంతమేర అందుబాటులో ఉందనే విషయంపై ఎన్టీఆర్ జిల్లా వెబ్‌సైట్‌లో వివరాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఇసుక సకాలంలో ఇవ్వకున్నా, రవాణాచార్జీలు అధికంగా వసూలు చేస్తున్నా, ఇతరత్రా ఏమైనా ఇబ్బందులు ఉన్నా తెలియజేసేందుకు కృష్ణా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌లో 18004256026టోల్‌ఫ్రీ నెంబరును ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్రస్థాయిలో 18005994599 నెంబరుకు ఫిర్యాదు చేయవచ్చని ఆమె తెలిపారు. ఫిర్యాదులపై ప్రతిరోజు ఉదయం 5గంటలకు సమీక్ష చేయనున్నట్టు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ, ఇసుక బుకింగ్ చేసిన సమయంలో స్టాక్ పాయింట్ సిబ్బంది ఇచ్చిన టైమ్‌స్లాట్ ప్రకారం ఇసుకస్టాక్ పాయింట్లకు వాహనాలతో వెళ్లాలన్నారు. ఇసుక అక్రమరవాణా జరుగుతున్నట్లుగా రుజువైతే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	116, 125, 136
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.75

లక్ష్మీ తిరుపతమ్మ ఆలయానికి రూ.50 వేల విరాళం

గన్నవరం, ఆగస్టు 22: పాత గన్నవరంలోని లక్ష్మీ తిరుపతమ్మ ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన నర్రా ఆదిత్య శివ కుటుంబ సభ్యులు రూ.50,249 విరాళాన్ని గురువారం ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్‌కు అందజేశారు. శివ ఆదిత్య తన తొలి జీతాన్ని ఆలయానికి ఇవ్వటం అభినందనీయమని శ్రీధర్ అన్నారు. భక్తులందరి సహకారంతో నూతనంగా నిర్మిస్తున్న సేవా సదనాన్ని త్వరలో అందుబాటులోకి తెస్తామని ఆయన తెలిపారు. పొట్ల శివలీల, నర్రా ఉమావతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న దాతలు

పాముకాటుతో కౌలు రైతు మృతి



మృతి చెందిన కందుకూరి రాజు

ఉయ్యూరు, ఆగస్టు 22: పెద ఓగిరాలలో గురువారం పాముకాటుతో కౌలురైతు మృతి చెందాడు. చిన ఓగిరాలకు చెందిన కందుకూరి రాజు(35) పెద ఓగిరాలకు చెందిన బొమ్మారెడ్డి నాగేశ్వరరెడ్డికి చెందిన రెండెకరాల మెట్టపొలం కౌలుకు తీసుకుని పసుపు, క్యాబేజీ పండిస్తున్నాడు. ఉదయం పంటకు నీరుపెట్టేందుకు పొలానికి వెళ్లి అక్కడ ఉన్న ప్లాస్టిక్ ట్యూబ్ మడత విప్పుతుండగా అందులో ఉన్న పాముకాటు వేసింది. వెంటనే అతనిని పొరుగున ఉన్నవారు ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చారు. చికిత్సపొందుతూ అక్కడ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఐదేళ్ల కుమార్తె, రెండేళ్ల కుమారుడు ఉన్నారు.

ఇంటి ముందు కారు పార్క్ చేయొద్దన్నందుకు దాడి

పెనమలూరు, ఆగస్టు 22: తన ఇంటి ముందు కారు పార్కు చేయొద్దన్నందుకు తనపై తన కుటుంబ సభ్యులపై పక్కింటి వ్యక్తి దాడి చేశాడని యనమలకుదురు గ్రామానికి చెందిన గండికోట నాగరాజు ఇచ్చిన ఫిర్యాదుపై పెనమలూరు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండికోట నాగరాజు తన సొంత ఇంట్లో నివాసముంటున్నాడు. ఈనెల 18న నాగరాజు ఇంటి పక్కనే నివాసముండే నాని తన కారును నాగరాజు ఇంటిముందు పార్కు చేశాడు. తమ ఇంటి వద్ద కారు పెటొద్దు అని నాగరాజు అభ్యంతరం తెలిపాడు. దీంతో నాని కోపంతో నాగరాజుపై దాడి చేశాడు. అడ్డొచ్చిన నాగరాజు తండ్రి, నాయనమ్మలపైనా దాడి చేశాడు. గాయపడిన నాగరాజును కుటుంబసభ్యులు విజయవాడ జీజీహెచ్‌కు తరలించారు.



ఉయ్యూరులో ఎరువుల షాపులో తూకాన్ని పరిశీలిస్తున్న తూనికలు కొలతల అధికారి

ఎరువుల షాపుల్లో తనిఖీలు

ఉయ్యూరు, ఆగస్టు 22: ఉయ్యూరులో ఎరువుల షాపుల్లో తూనికలు, కొలతల అధికారులు గురువారం తనిఖీలు చేశారు. అసిస్టెంట్ కంట్రోలర్ టి.రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఆశాఖ ఉద్యోగులు ఎరువుల బస్తాల బరువు తనిఖీ చేశారు. తూకంలో తేడా ఉంటే జరిమానాతో పాటు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిర్వహణపై నిర్లక్ష్యం

- సర్వీసు రోడ్డు పారిశుధ్య నిర్వహణను పట్టించుకోని జాతీయ రహదారి అధికారులు
- గంగూరు, ఈడుపుగల్లు, గోసాల, కంకిపాడు పంచాయతీలపై భారం



గోసాల వద్ద సర్వీసు రోడ్డుపై వ్యర్థాల తొలగింపునకు పంచాయతీ సొమ్ముతో ఏర్పాటు చేసిన యంత్రం

కంకిపాడు, ఆగస్టు 22: కంకిపాడు ఒకటో తూము వద్ద నుంచి ఆరోగ్య మాత ఆస్పత్రి వరకు 3.1 కిలో మీటర్ మేర సర్వీసు రోడ్డు నిర్వహణను జాతీయ రహదారి అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో పనుల భారం పంచాయతీలపై పడుతోంది. ఈ నెల 24వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కంకిపాడులోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగనున్న క్రెడై సంస్థ సమావేశాలకు హాజరు కానున్నారు. దీంతో జాతీయ రహదారి వెంట ఉన్న గ్రామాలైన గంగూరు, ఈడుపుగల్లు, గోసాల, కంకిపాడు పంచాయతీ అధికారులు జాతీయ రహదారిని శుభ్రపరిచే పనిలో గురువారం నిమగ్నమయ్యారు. యంత్రాలు పెట్టి పంచాయతీల నిధులతో శుభ్రం చేయించారు. పంచాయతీ పారిశుధ్య సిబ్బంది కూడా గంగూరు నుంచి కంకిపాడు వరకు ప్రధాన రహదారిని శుభ్రం చేశారు. నిర్వహణ వ్యయం పంచాయతీలపై పడుతోందని అని కార్యదర్శులు చెబుతున్నారు.



సర్వీసు రోడ్డును శుభ్రం చేస్తున్న గోసాల పంచాయతీ పారిశుధ్య సిబ్బంది

ఎన్నిసార్లు శుభ్రం చేసినా వ్యర్థాలు వేస్తున్నారు

జాతీయ రహదారి వెంబడి డివైడర్‌పై రాత్రిపూట గుర్తు తెలియని వ్యక్తులు కొబ్బరి బొండాలు, పిచ్చి చెట్లు, తదితర వ్యర్థాలు వేస్తున్నారు. ఎన్నిసార్లు శుభ్రపరిచినా మళ్లీ యథావిధిగా వ్యర్థాలు వేస్తున్నారు. దీనిపై ఎన్‌హెచ్‌ఐ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం.

- సురేంద్రబాబు, జాతీయ రహదారి మెయింటెన్స్ మేనేజర్

పంచాయతీ నిధులతో శుభ్రం చేయిస్తున్నాం

కంకిపాడు, గోసాల, పునాదిపాడు పరిధిలోని జాతీయ రహదారి, సర్వీసురోడ్డును ఎన్‌హెచ్‌ఐ అధికారులు శుభ్రం చేయించాలి. అయితే వాళ్లు సరిగ్గా పట్టించుకోకపోవడంతో పంచాయతీ నిధులతో శుభ్రం చేయిస్తున్నాం. పంచాయతీల్లో నిధులు అంతంత మాత్రంగా ఉంటాయి. ఎన్‌హెచ్‌ఐ అధికారులు స్పందించి మాపై అదనపు భారం పడకుండా చూడాలి

- సెంగెపు శ్రీనివాసరావు, గోసాల సర్పంచ్



వెల్దిపాడులో తల్లి పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో మొక్కలు నాటుతున్న ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, సర్పంచ్, టీడీపీ నాయకులు

కాలుష్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ఉంగుటూరు, ఆగస్టు 22: మొక్కలు లేనిదే మానవజాతికి మనుగడే లేదని, మొక్కలు నాటి, వాటిని సంరక్షించి, కాలుష్యరహిత సమాజాన్ని నిర్మిద్దామని టీడీపీ మండలాధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. తల్లి పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెల్దిపాడులో సర్పంచ్, టీడీపీ నాయకులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ప్రతి తల్లి తన బిడ్డను బాధ్యతతో పెంచి పోషించి ప్రయోజకుడిని చేస్తుందని, ప్రతి ఒక్కరూ తమ తల్లిపేరుతో ఒక మొక్కను నాటి దానిని పెంచి వృక్షాన్ని చేయాలని వాతావరణంలో ఆక్సిజన్ స్థాయిని పెంచేందుకు తోడ్పడాలని సూచించారు. సర్పంచ్ లాం నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు నెక్కలపూడి వెంకట రాజమన్నార్, కడియాల ఉమామహేశ్వరరావు, రామ్మోహన్‌రావు, పరిటాల విష్ణువర్ధన్‌రావు, బొకినాల నాగేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ బి.కుసుమ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి చెట్లుగా ఎదిగేంతవరకు వాటి పరిరక్షణ బాధ్యతలు తీసుకోవాలని ఎంపీపీ వడ్లమూడి సరోజిని సూచించారు. పొట్టిపాడులో గురువారం సర్పంచ్, టీడీపీ నాయకులతో కలిసి ఆమె మొక్కలు నాటారు. సర్పంచ్ కత్తుల జ్యోతి, టీడీపీ నాయకులు ఈసరి రవికుమార్, కర్నాటి మణికంఠ, గూడపాటి వెంకటేశ్వరరావు, గ్రేడ్-5 సెక్రటరీ వి.అమూల్య, ఫీల్డ్ అసిస్టెంట్ భవాని పాల్గొన్నారు.

ఉంగుటూరు ఎస్సైగా గోవింద్



బాధ్యతలు స్వీకరిస్తున్న యు.గోవింద్

ఉంగుటూరు, ఆగస్టు 22: ఉంగుటూరు ఎస్సైగా యు.గోవింద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్సైకు ఏఎస్సై అబ్దుల్ సత్తార్, స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛాలందించి శుభాకాంక్షలు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని, పేకాట, కోడిపందాలు, జూదం గంజాయి, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెడతామని, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతానని ఆయన స్పష్టం చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

పెనమలూరు, ఆగస్టు 22: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు గన్నవరం డీఎస్పీ శ్రీనివాసరావు, పెనమలూరు సీఐ వెంకటరమణ సూచించారు. గురువారం పెనమలూరు పోలీసు స్టేషన్‌లో సైబర్‌నేరాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. సెల్‌ఫోన్లకు వచ్చే ఓటీపీలను ఎవరికీ చెప్పొద్దని, బ్యాంకు అకౌంట్లకు స్ట్రాంగ్ పాస్‌వర్డును పెట్టుకుంటూ, ఎప్పటికప్పుడు మార్చుకుంటూ ఉండాలని వారు సూచించారు. అనుమానాస్పద లింకులపై క్లిక్ చెయ్యొద్దని, పబ్లిక్ ప్రదేశాల్లో వైఫై ఉపయోగిస్తూ బ్యాంక్ లావాదేవీలు చెయ్యొద్దని వివరించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు ఉంచొద్దని, ఫేక్ లాటరీలు, ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్‌లను నమ్మొద్దని హితవు పలికారు. ఇంటివద్దనే ఉండి డబ్బులు పెట్టుబడిగా పెడితే అధిక లాభాలొస్తాయని ఎవరైనా చెబితే నమ్మొద్దని, ఇలాంటి మోసాలకు గురైన వ్యక్తులు 1930హెల్ప్ లైన్‌కు, సైబర్‌మిత్ర9121211100నెంబరుకు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని వారు సూచించారు. ఇంట్లో నగదు, బంగారం లాంటి విలువైన వస్తువులు పెట్టి తాళం కనిపించేట్లు వేసి ఊర్లకు వెళ్లకూడదని, పోలీసు స్టేషనులో చెప్పి ఎల్‌హెచ్‌ఎంఎస్ సిస్టంను అమర్చుకోవాలని వివరించారు. కార్యక్రమంలో ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ వెంకటరమణ

మాదక ద్రవ్యాల వినియోగంతో అనర్థాలు

కంకిపాడు, ఆగస్టు 22: మాదక ద్రవ్యాలు వినియోగిస్తే అనేక అనర్థాలు కలుగుతాయని, విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని సీఐ మురళీకృష్ణ సూచించారు. కంకిపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై ఆయన అవగాహన కల్పించారు. యువత మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్నారని, గ్రామాల్లో గంజాయికి బానిసలైన యువత ఎవరైనా ఉంటే వారి సమాచారాన్ని పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు. ఎస్సై డి.సందీప్, ఎస్సై-2 తాతాచార్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, సీఆర్పీ పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ మురళీకృష్ణ, పక్కన ఎస్సై సందీప్

ఘనంగా చిరంజీవి జన్మదినోత్సవం

కంకిపాడు, ఆగస్టు 22: సినీ రంగంలో తనకంటూ ఓ ప్రత్యేకత గుర్తింపు తెచ్చుకున్న నటుడు మెగాస్టార్ చిరంజీవి అని టీడీపీ సీనియర్ నాయకుడు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. చిరంజీవి యువత పెనమలూరు నియోజకవర్గ అధ్యక్షుడు, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగ జయప్రకాష్ ఆధ్వర్యంలో చిరంజీవి పుట్టిన రోజు వేడుకలు గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తుమ్మలపల్లి హరికృష్ణ విచ్చేశారు. పచ్చిపాల రాజా, కొప్పరాజు సురేష్, కొండా నాగేశ్వరరావు, సుధీర్, మేకల నాగేశ్వరరావు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



కంకిపాడులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, ఏనుగ జయప్రకాష్

హనుమాన్‌జంక్షన్‌లో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్‌లో గురువారం చిరంజీవి జన్మదినోత్సవం సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను జనసేన దెందులూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటలక్ష్మితో కలిసి జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు చేశారు. కేతినీడు జైన్, పావులూరి రామరావు, వడ్డి వాసవి, గరికపాటి చంటి, షేక్ అహ్మద్, వీరం వినయ్, చలమలశెట్టి చందు, వడ్డి అశోక్, తరుణ్, భార్గవ్, తోటప్రోలు ఫణి, జయరాణి, శివలీల, ప్రసన్న, సూర్యావతి, వీర మహిళలు పాల్గొన్నారు.

మట్టి నమూనా పరీక్షలు చేయించుకోండి

గన్నవరం, ఆగస్టు 22: రైతులు తప్పనిసరిగా మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలని ఏడీఏ శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని సూరంపల్లిలో జీపీపీ పొలం బడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మట్టి నమూనా సేకరించి రైతుల ముందే పరీక్షలు చేశారు. కార్బన్, పీహెచ్ సేంద్రియ కార్బన్ శాతం ఎంత మోతాదులో ఉండాలో రైతులకు ఆయన వివరించారు. సర్పంచ్ ఈలప్రోలు శ్రీనివాసరావు, ఏవో లక్ష్మీ తేజశ్వి పాల్గొన్నారు.



సూరంపల్లిలో పొలంబడి కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు

సామాజిక సేవే లక్ష్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 22: సామాజిక సేవలు, ప్రజలందరికీ విద్య, వైద్యం చేరువచేయడమే లక్ష్యంగా మానవత సంస్థ పనిచేస్తోందని ఆ సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు తెలిపారు. హనుమాన్‌జంక్షన్‌లో మానవత ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మానవత డైరెక్టర్ నారగాని కొండలరావు మనవడు రామశశాంక్ పుట్టినరోజు సందర్భంగా అల్పాహారం అందించారు. సూర్యనారాయణ, పీవీఎస్ చలం, రాజేశ్వరరావు, పాల్గొన్నారు.



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, కొండలరావు, సూర్యనారాయణ



లైక్వాండో రాష్ట్ర పోటీల్లో బంగారు పతకం సాధించిన బ్లెస్సీ నేహాను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రామోజీరావు, ఏవో మధుసూదనరావు

వైద్య విద్యార్థినికి బంగారు పతకం

గన్నవరం, ఆగస్టు 22: వైద్య విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించడం అభినందనీయమని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు అన్నారు. చిన అవుటపల్లి డాక్టర్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో బీడీఎస్ రెండో సంవత్సరం చదువుతున్న పి.బ్లెస్సీ నేహా ఇటీవల విజయనగరంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన తైక్వాండో(మార్షల్ ఆర్ట్స్) చాంపియన్ షిప్ 2024 పోటీల్లో బంగారు పతకం సాధించింది. గురువారం బ్లెస్సీ నేహా అభినందన సభ కళాశాలలో నిర్వహించారు. హైదరాబాద్‌లో నిర్వహించే జాతీయ చాంపియన్‌షిప్ పోటీలకు బ్లెస్సీ నేహా ఎంపిక కావడం గర్వకారణమని ప్రిన్సిపాల్ అన్నారు. ఏవో వై.మధుసూదనరావు, డాక్టర్లు ఎన్.కోటేశ్వరరావు, నాయుడు, కోచ్ అంకమరావు పాల్గొన్నారు.

వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ

కంకిపాడు, ఆగస్టు 22: వృద్ధులను, తల్లిదండ్రులను భారంగా కాకుండా బాధ్యతగా చూడాలని జనసేన నాయకుడు ముప్పా రాజా సూచించారు. కంకిపాడుకు చెందిన కస్తూరి సీతారామస్వామి 5వ వర్ధంతిని పురస్కరించుకుని పెనమలూరు మండలం గోసాలలోని వాసవ్య మహిళ మండలి వృద్ధాశ్రమంలో గురువారం వృద్ధులకు చీరలు, బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. తల్లిదండ్రులను వృద్ధాప్యంలో ఎంతో ప్రేమగా చూసుకోవాలని రాజా సూచించారు. కస్తూరి ఝాన్సీలక్ష్మి, పచ్చిపాల అన్నపూర్ణ, కస్తూరి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



వృద్ధులకు చీరలు, బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేస్తున్న జనసేన నాయకుడు ముప్పా రాజా, కస్తూరి ఝాన్సీ లక్ష్మి

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	116, 125, 136
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.75

సర్పంచ్ కృష్ణకుమారికి వీవర్స్ సొసైటీలో సత్కారం



చల్లపల్లి, ఆగస్టు 22 : చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించటం అభినందనీయమని జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీ ఎస్.రఘునంద అన్నారు. ఢిల్లీలో సత్కారం అందుకున్న సర్పంచ్ కృష్ణకుమారిని చల్లపల్లి వీవర్స్ సొసైటీలో సన్మానించారు. ఎంపీపీ కోట విజయ రాధిక, చేనేత అభివృద్ధి అధికారి ఎస్.వి.ఫణిబాబు, టీడీపీ నేతలు రావి రాజేశ్వరరావు, మోర్ల శివ, సొసైటీ మేనేజర్ బళ్లా మధుసూదనరావు, బళ్లా శ్రీనివాసరావు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.



మానవత ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 22 : సమాజంలో శాంతియుత వాతావరణాన్ని పెంపొందించాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మచిలీపట్నం శాఖ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. మానవత స్వచ్ఛంవ సేవా సంస్థ 20వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్టార్ కళాశాల నుంచి బస్టాండ్ సెంటర్ వరకు చేపట్టిన శాంతి ర్యాలీని గొర్రెపాటి గోపీచంద్ జెండా ఊపి ప్రారంభించారు. సంస్థ ప్రధాన సలహాదారుడు , న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ, మహిళల రక్షణకు ఉన్న చట్టాలు కచ్చితంగా అమలు జరగాలన్నారు. సంస్థ కార్యదర్శి కానుకొలను ఫణిభూషణ్ , పి.సాయి, కృష్ణ ప్రసాద్, మద్దాల చింతయ్య , టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి పి.వి.ఫణికుమార్, స్టార్ కళాశాల డైరక్టర్ అయ్యప్పస్వామి, స్టార్ కాలేజి ప్రిన్సిపాల్ ఎంఎల్ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం లక్ష్మీ టాకీసు సెంటర్‌లో కోల్‌కతాలో వైద్యవిద్యార్థిని హత్యాచారానికి నిరసనగా మానవహారం నిర్వహించారు.



మర్రివాడలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : వర్ల

మర్రివాడ (పమిడిముక్కల) : ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మర్రివాడలో గురువారం పర్యటించి ప్రజలసమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ సచివాలయానికి చేరుకుని ఉద్యోగులతో మాట్లాడి గ్రామం లో సమస్యలపై ఆరా తీశారు. మౌలిక వసతులు కల్పించడంలో గత ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించి ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తుందన్నారు. గ్రామసర్పంచ్ వంపుగడల ఫ్రాన్సిస్, టీడీపీ నాయకుడు రాజేంద్రప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆదరణ పుస్తకావిష్కరణ

నాగాయలంక : ప్రముఖ రచయిత సామర్ల రమేష్ రచించిన ఆదరణ నవలను ఎల్ఐసీ బ్రాంచి మేనేజర్ ఆకుల హరి ప్రసాద్ పౌర గ్రంథాలయంలో గురువారం ఆవిష్కరించారు. వృత్తిరీత్యా మంగుళూరులో పెట్రో కెమికల్స్ కంపెనీలో మేనేజర్‌గా ఉంటున్న రమేష్ మానవ సంబంధాలపై దశాబ్దాలుగా కథలు రాస్తూ, నేడు వృద్ధులపై ఆదరణ నవల రాయటం ముదావహమన్నారు. ప్రముఖ రచయిత్రి సింహాద్రి పద్మ ఆదరణ పుస్తకాన్ని సమీక్షించారు. నవలలోని కుటుంబసభ్యుల పాత్రలను చక్కగా విశ్లేషించారు. అధ్యక్షత వహించిన పోస్టుమాస్టర్ సింహాద్రి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ వృత్తుల ఇతివృత్తంతో ఆంగ్ల, తెలుగు సాహిత్యంలో నవలు, కథలు విరివిగా వస్తున్నాయన్నారు. మన కుటుంబ వ్యవస్థ ఎటువైపు పోతుందో నేటితరం ఆలోచించాలని కోరారు. విశ్రాంతోపాధ్యాయులు సబ్బినేని సాంబశివరావు, బందెల కనకారావు, గుడిసేవ విష్ణుప్రసాద్, కోడూరు సత్యనారాయణ, జి.సూర్యనారాయణ, కొక్కిలిగడ్డ కరుణ శ్రీ, తుంగల వెంకట గిరి, రామబ్రహ్మం, ప్రభుదాసు తదితరులు ప్రవహించారు.ఇటీవల సాహితీ అవార్డులను పొందిన జి.సూర్యనారాయణ, సింహాద్రి పద్మలను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి



గుడివాడ రూరల్ : రైతులు రసాయనిక ఎరువులు తక్కువ మోతాదులో వాడాలని వ్యవసాయాధికారిణి బి.అనంత లక్ష్మి అన్నారు. చౌటపల్లిలో అట్లూరి రమణ ప్రసాద్ పొలంలో గురువారం పొలంబడి జరిగింది. ప్రతి రైతు ముందుగా కలుపు నివారణ, ఎలుకల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రసాయనిక ఎరువుల బదులు సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎడ్లంక వంతెన నిర్మాణానికి కృషి

అవనిగడ్డ రూరల్ : ఎడ్లంక వాసుల చిరకాల వాంఛ కృష్ణానదిపై వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కృషి చేస్తున్నారని యువ నాయకుడు మండలి వెంకట్రామ్ తెలిపారు. ఎడ్లంక గ్రామానికి వెళ్లే మార్గం గవరద ప్రవాహానికి పూర్తిగా కొట్టుకుపోవటంతో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఎడ్లంక రేవు మార్గాన్ని పునరుద్ధరించారు. డ్రైనేజీ శాఖ ఇన్‌చార్జ్ డీఈఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో 70 మీటర్లు పొడవైన రహదారి ఏర్పాటు చేశారు. అభివృద్ధి పనులను మండలి వెంకట్రామ్ పరిశీలించారు. టీడీపీ నాయకులు కొల్లూరి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ పాలెపు వెంకటేశ్వరరావు, పాలెపు దుర్గారావు, బండే రాఘవ, గుడివాక నరహరి, కోట సాయి కృష్ణ, తండు గంగాధర్, పాల్గొన్నారు.



బందరులో చిరంజీవి జన్మదిన కేక్ కట్ చేస్తున్న బండి రామకృష్ణ, ఛాయాదేవి



అవనిగడ్డలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



నాగాయలంకలో రక్తదానం చేస్తున్న యువత

యువతకు స్ఫూర్తి చిరంజీవి

• జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే మండలి, జనసేన నేత రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 22 : స్వయంకృషితో ఎదిగిన మెగాస్టార్ చిరంజీవి యువతకు స్ఫూర్తి అని వక్తలు పేర్కొన్నారు. మచిలీపట్నంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. జనసేన కార్పొరేటర్ పినిశెట్టి నాగఛాయాదేవి ఆధ్వర్యంలో జడ్పీ సెంటర్‌లో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ కేకు కట్ చేసి మాట్లాడారు. గడ్డం రాజు, మహమ్మద్ సమీర్, వంపుగడల చౌదరి, కొట్టె వెంకట్రావు, పినిశెట్టి వేణు పాల్గొన్నారు. రాధా రంగా మిత్ర మండలి అధ్యక్షుడు బుల్లెట్ ధర్మారావు ఆధ్వర్యంలో సహాయ సేవా క్యాంటీన్‌లో టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నదానం చేశారు. లంకిశెట్టి నీరజ, పిప్పళ్ళ కాంతారావు పాల్గొన్నారు. **గుడివాడ :** చిరంజీవి యువత జిల్లా అధ్యక్షుడు మేకా మురళీ ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్ గోకరకొండ బలరామ్ కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. థియేటర్ యజమాని తుమ్మల రాము, చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు కొయిలాపు రాము, నల్లగంచు రాంబాబు, పండ్రాజు సాంబశివరావు, అర్జా మోనాలిసా, పి.సుబ్రహ్మణ్యం(చంటి), చక్రవర్తి, గోవాడ చంటి, కోన కేశవ్, అద్దేపల్లి పురుషోత్తం, బోయిన చంటి పాల్గొన్నారు. కొయిలాపు రాము యూత్ ఆధ్వర్యంలో చిరంజీవి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. **అవనిగడ్డ :** స్వయం కృషితో ఎదిగిన మెగాస్టార్ చిరంజీవి స్ఫూర్తి ప్రదాత అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. చిరంజీవి జన్మదిన వేడుకలు గురువారం అవనిగడ్డలో చిరంజీవి యువత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుద్ధప్రసాద్ కేక్ కట్ చేశారు. మండలి వెంకట్రామ్, మత్తి వెంకటేశ్వరరావు, గాజుల శంకరరావు, చిరంజీవి యువత నియోజకవర్గ అధ్యక్షుడు సిద్ధినేని అశోక్ నాయుడు, బండ్రెడ్డి హరి, పసుపులేటి రవికుమార్, మడమల రంజిత్, బొప్పన పృథ్వి, మద్దూరి మహేష్, అప్పికట్ల తారక మస్తాన్, కూరేటి జగన్, బాదర్ల లోలాక్షుడు, యలవర్తి ఆది తదితరులు పాల్గొన్నారు. **కోడూరు :** చిరంజీవి పుట్టిన రోజు వేడుకను కోడూరు ప్రధాన సెంటర్‌లో ఘనంగా జరిపారు. మర్రె గంగయ్య, ఉల్లి శేషగిరిరావు, పూతబోయిన శ్రీనివాసరావు, దామెర్ల నారాయణ, వేములపల్లి రాజేష్, కొండవీటి సునీత, పిల్లి మల్లిఖార్జునరావు, కాగిత రామారావు, గోగినేని సోమశేఖరరావు, మేడా శివాజీ, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, కోట రాంబాబు పాల్గొన్నారు.

చిరంజీవి యువతకు సత్కారం

అవనిగడ్డ : చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా జిల్లా చిరంజీవి యువత కార్యవర్గాన్ని సన్మానించారు. జిల్లా కార్యదర్శి మడమల రంజిత్ కుమార్, నియోజకవర్గ చిరంజీవి యువత అధ్యక్షుడు సిద్ధినేని అశోక్ నాయుడు, అవనిగడ్డ, మోపిదేవి మండలాల చిరంజీవి యువత అధ్యక్షుడు బొప్ప పృథ్వీ, కోసూరి అవినాష్‌లను ఘనంగా సత్కరించారు. జనసేన జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు, జిల్లా కార్యదర్శి గాజుల శంకరరావు, తారక మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

చల్లపల్లి : చిరంజీవి పుట్టిన రోజు వేడుకలు స్థానిక సీయోను వృద్ధాశ్రమంలో ఘనంగా జరిగాయి. పుట్టిన రోజు కేకును సోమిశెట్టి శివ నాగేశ్వరరావు, సోమిశెట్టి రాఘవేంద్రరావు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మోర్ల రాంబాబు, మోర్ల శివ కట్ చేశారు. అన్నదాన కార్యక్రమం జరిగింది. జనసేన నేత, పసుపులేటి శ్రీను, టీడీపీ, జనసేన నాయకులు నాయకులు పాల్గొన్నారు.

రక్తదానం, మెగా వైద్యశిబిరం

నాగాయలంక :. చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా గురువారం శ్రీ రామపాదక్షేత్రంలో జిల్లా చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నాగాయలంక సబ్ బ్రాంచ్ చైర్మన్ భోగాది శివవిష్ణువర్ధన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 52 మంది రక్తదానం చేశారు. 180 మందికి వైద్య పరీక్షలు చేశారు. మండలి వెంకట్రామ్ , డాక్టర్ టి.ఎస్.ఎస్.బాలాజీ, భవిరి శంకర్‌నాథ్, కొండపల్లి రాంబాలాజీ, తలశిల నాని, అంబటి శ్యాంప్రసాద్, కొల్లూరి వెంకటేశ్వరరావు, రాయపూడి వేణుగోపాలరావు, బండ్రెడ్డి మల్లిఖార్జునరావు, గుడివాక శేషుబాబు, తహసీల్దార్ హరినాథ్, వర్రె తరుణ్ కుమార్, యర్రంశెట్టి నాగ పవన్, భాను పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

నాగాయలంక : టి.కొత్తపాలెంలో జనసేన పార్టీ మండల నాయకుడు బండ్రెడ్డి హరి మిత్ర బృందం ఆధ్వర్యంలో గ్రామస్థులకు 1500 మొక్కలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి



కరగ్రహారంలో మొక్కనాటుతున్న వల్లభుని



తోట్లవల్లూరులో మొక్కనాటుతున్న రాజామణి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 22 : ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరిట మొక్క నాటి సంరక్షించాలని కరగ్రహారం మాజీ సర్పంచ్ వల్లభుని నాగుల్‌మీరా అన్నారు. కరగ్రహారం సచివాలయం వద్ద గురువారం తల్లికి వందనంలో మొక్క నాటే కార్యక్రమం నిర్వహించారు. తోట భాస్కరరావు, బొర్రా రాము, బత్తిన నాగరాజు, కొల్లా అంజి తదితరులు పాల్గొన్నారు. **మోపిదేవి :** ఉత్తరచిరువోలులంక గ్రామంలో తల్లికి వందనం కార్యక్రమాన్ని ఎంపీపీ నడకుదుటి జనని కుమారి ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రం వద్ద, ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. మండల టీడీపీ అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, ఉపాధ్యాయులు గురవయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు. **ఘంటసాల :** ఘంటసాల జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ, ఉపసర్పంచ్ అయిన పూడి భాను ప్రకాష్, ఎస్సై ప్రతాప్ రెడ్డి మొక్కలను నాటారు. ఉపాధి హామీ పథకం సిబ్బంది, హెడ్‌కానిస్టేబుల్ పద్మారావు, విద్యార్థులు పాల్గొన్నారు. చిట్టూర్పు లో సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి కృష్ణవేణి, గ్రామ టీడీపీ నాయకులు గుత్తికొండ వరప్రసాద్ మొక్కలు నాటారు. . **అవనిగడ్డ రూరల్ :** పులిగడ్డ ఎంపీపీ స్కూల్‌లో గ్రామపంచాయతీ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ మొక్కలు నాటారు. ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, పంచాయతీ ఈవో అనిత, ఎన్ఆర్ఈజీఎస్ రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు **తోట్లవల్లూరు :** జడ్పీ హైస్కూల్లో ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జడ్పీటీసీ సభ్యుడు రామ్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో టి స్వర్ణలత, సర్పంచ్ పెనుముత్స రాధిక, ఎస్ఎంసీ చైర్మన్ వల్లూరు సుజాత, సచివాలయ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు మొక్కలు నాటారు. పలు గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, టీడీపీ నాయకులు మొక్కలు నాటారు.

డీఎంహెచ్‌వో చేవేంద్రపాలెం పీహెచ్‌సీ తనిఖీ

పెడన రూరల్ : విషజ్వరాలు అధికంగా ఉండటంతో ఆరోగ్య సిబ్బంది అప్రమత్తతతో ఉండాలని డీఎంహెచ్‌వో గీతాబాయి ఆదేశించారు. చేవేంద్రపాలెం పీహెచ్‌సీని గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఏఎన్ఎంలు ఇంటింటికీ తిరిగి ప్రజల ఆరోగ్య పరిస్థితిని గుర్తించి, అవసరమైన వారికి చికిత్స చేయించాలన్నారు. ఓపీ పరిశీలించారు. డాక్టర్ రమ్యసాయి, సత్యన్నారాయణ పాల్గొన్నారు.

కోల్‌కతా హత్యాచార ఘటనపై నిరసన



బందరులో ఎల్ఐసీ ఉద్యోగులు, గుడివాడలో జనసేన ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

మచిలీపట్నం టౌన్ : కోల్‌కతాలో వైద్యవిద్యార్థిని హత్యాచారాన్ని ఖండిస్తూ ఎల్ఐసి ఉద్యోగులు గురువారం ఎల్ఐసీ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎల్ఐసీ ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శి కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో సంఘ నాయకులు సుధాకర్, టి. చంద్రపాల్, రాజశేఖర్, వై. స్వామినాథ్, బి.హెచ్. మాథుర్, ఎస్.వి. రత్నారావు, ఉదయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషోర్‌కుమార్ మాట్లాడుతూ, సుప్రీం కోర్టు సూచనల మేరకు నిందితులను అరెస్టు చేయాలన్నారు. **గుడివాడ :** కోలకత్తాలో వైద్య విద్యార్థిని హత్యాచార సంఘటనను ఖండిస్తూ జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి గుడివాడలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

ప్రకృతి విపత్తుల్లో నష్టం నివారణపై అవగాహన

నాగాయలంక : భావదేవరపల్లిలోని మండలి వెంకట కృష్ణారావు మత్స్యకళాశాల ఆవరణలో విపత్తుల నుంచి రక్షణపై అవగాహన కల్పించారు. జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ విజయవాడ కమాండర్ పింటు నాంది విపత్తుల సమయంలో ప్రజలను ఎలా రక్షించాలి అనే విషయాలపై మాక్‌డ్రిల్ ద్వారా వివరించారు. సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, తహసీల్దార్ ఏ.హరినాథ్‌బాబు, ఈవోపీఆర్డీ అప్పల నరసమ్మ, డాక్టర్ శివరామకృష్ణ తదితరులు పర్యవేక్షించారు.

మంత్రి రవీంద్ర పాల్గొనే గ్రామసభలు

మచిలీపట్నం టౌన్ : బందరు మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం నిర్వహించనున్న గ్రామసభల్లో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొంటారు. ఉదయం 9 గంటలకు భోగి రెడ్డిపల్లి, 10 గంటలకు చిన్నాపురం, 11 గంటలకు తాళ్ళపాలెం గ్రామ సభల్లో పాల్గొంటారన్నారు.

పాఠశాల స్థలం సర్వే

కోడూరు : విశ్వనాథపల్లిలోని ఎంపీయూపీ పాఠశాల స్థలాన్ని పలువురు ఆక్రమించుకున్నారని గొల్ల ఏడుకొండలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఎంపీడీవో ఆర్.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మండల సర్వేయర్, గ్రామ సర్వేయర్ గురువారం సర్వే నిర్వహించారు.

పారదర్శకంగా ఓటర్ల సర్వే

కూచిపూడి : ఓటర్ల స్థితిగతులపై బీఎల్వోలు ఇంటింటా సర్వే పారదర్శకంగా పూర్తి చేయాలని తహసీల్దార్ కె.మస్తాన్ ఆదేశించారు. కొత్త ఓటర్ల నమోదు, మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపు, సవరణలు, కార్డుల జారీ, జెండర్ సవరణలు, అడ్రస్ మార్పులు తదితర అంశాలను నిర్ణీత గడువు లోగా సర్వే పూర్తి చేయాలన్నారు. డీటీలు సిహెచ్.గోపాలరావు, కె.శ్రీనివాసరావు, ఆర్ఐ విజయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పఠనా సామర్థ్యం పెంపొందించాలి

పెడన రూరల్ : విద్యార్థులలో పఠనా సామర్థ్యం పెంపొందించాలని ఎంఈవో-1 ఎంవిఎస్ దుర్గాప్రసాద్ అన్నారు. దావోజీపాలెం, చోడవరం, పుల్లపాడు పాఠశాలలను తనిఖీచేశారు. పుల్లపాడులో విద్యార్థుల పఠనా సామర్థ్యం తక్కువగా ఉందని, తగు చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనం సంతృప్తికరంగా ఉందన్నారు.

కట్లపల్లి పాడిరైతులకు బోనస్

పెడన రూరల్ : కట్లపల్లి పాల కేంద్రంలో 94 మంది పాల ఉత్పత్తిదారులకు రూ.1..11లక్షల బోనస్‌ను మిల్క్ యూనియన్ డైరెక్టర్ అర్జా నగేష్ పంపిణీ చేశారు.ముక్కు వెంకటేశ్వరరావుకు రూ.13,957లతో పాటి స్టాండ్ ఫ్యాన్, ముక్కు హనుమంతరావుకు రూ.6000తోపాటు టేబుల్ ఫ్యాన్ ప్రోత్సాహకంగా అందించారు. గుడ్లవల్లేరు మిల్క్ చిల్లింగ్ సెంటర్ మేనేజరు తోట సత్యన్నారాయణ, సూపర్‌వైజర్ బసవరాజు కుమార్, వేతన కార్యదర్శి రాము పాల్గొన్నారు.

సాగునీరు అందక రైతుల ఆందోళన

కోడూరు : మండలంలో మంద పాకల శివారు పాదాలవారిపాలెం, జరుగువానిపాలెం గ్రామాల్లో 4, 5 నెంబర్ల కాలువల కింద సాగునీరు అందటం లేదంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. నారుమడులు పోసి 20 రోజులు కావొస్తున్నప్పటికీ సాగునీరు కాలువ దిగువ ప్రాంతానికి రావటం లేదని, సంబంధిత ఇరిగేషన్ అధికారులు స్పందించి సాగునీరు పూర్తిస్థాయిలో అందించాలని కోరుతున్నారు.

పెడన కమిషనర్ బదిలీ

పెడన : పెడన మునిసిపల్ కమిషనర్ బి. వెంకట్రామయ్యను డీఎంఏ కార్యాలయానికి బదిలీ చేశారు. పెడన నూతన కమిషనర్‌గా తాడేపల్లిగూడెం మునిసిపాలిటీలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న గోపాలరావును నియమించారు.

ముషారఫ్ కోసం గాలింపు

కోడూరు : హంసలదీవి బీచ్ వద్ద ఈ నెల 18న గల్లంతైన గుడివాడకు చెందిన అబ్దుల్ ముషారఫ్ కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు తహసీల్దార్ శ్రీను నాయక్ తెలిపారు. రెవెన్యూ కార్యాలయం వద్ద పోలీసు, మెరైన్, ఫిషరీష్ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గత నాలుగు రోజులుగా సముద్రతీరం వెంబడి, మాలకాయలంక కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో గాలింపు చర్యలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవనిగడ్డ డిఎస్పీ మురళీధర్, సీఐ యువ కుమార్, ఎస్సై పి.శిరీష, మెరైన్ సిబ్బంది, ఫిషరీష్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ కాలనీలో చోరీ

పామర్రు : ఎన్టీఆర్ కాలనీలో ఆత్మూరి రాంబాబు ఇంట్లో దొంగలు పడి రూ2.40 లక్షల విలువగల ఐదు నవర్సల బంగారు ఆభరణాలు, అరకేజీ వెండి పూజ సామాగ్రి, రూ.వెయ్యి నగదు అపహరించుకుని పోయారు. రాంబాబు ఫిర్యాదు మేరకు ఎస్సై అవినాష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని సీఐ శుభాకర్ పరిశీలించారు.

తహసీల్దార్ అబ్దుల్ రహమాన్ బదిలీ

పెడన : పెడన తహసీల్దార్ అబ్దుల్ రహమాన్ మస్తానాను సీఆర్డీఏకు బదిలీ చేశారు. ఆయన ఈనెలాఖరుకు రిలీవ్ కానున్నారు.